కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

- రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు
- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి


నీలాలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న పల్లె గంగారెడ్డి, నాయకులు

రెంజల్(బోధన్): గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమవుతుందని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. సంపదను సృష్టించి, ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ వ్యాప్తంగా ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెంజల్‌కు రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రెంజల్, దూపల్లి, నీలా గ్రామాల్లో ఎంపీ నిధులతో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు.అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని అడ్డుకుంటుందని విమర్శించారు.రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇంటిని నిర్మించి పేదలకు అందించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో 419 విషయాలను పెట్టినా ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయడం లేదని ఆరోపించారు. కేంద్రం ఇస్తోన్న ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

నవీపేట: మండలంలోని అబ్బాపూర్ (ఎం), అభంగపట్నం గ్రామాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి బీజేపీ అనే నినాదంతో అభివృద్ధి పథకాలను వివరించారు. రాబోయే స్థానిక ఎన్నికలలో బీజేపీని గెలిపించాలని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి కోరారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

బోధన్ : ఎడపల్లి మండల కేంద్రం, ధర్మారం గ్రామాల్లో ఎంపీ ధర్మపురి అర్వింద్ మంజూరు చేసిన నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డి మోహన్ రెడ్డి, మండల నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. గ్రామీణ ప్రాంతంలో అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు మంజూరు చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఎడపల్లిలో రజక సంఘ భవన నిర్మాణానికి రూ.3 లక్షలు,గంగమ్మతల్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.3 లక్షలు, ధర్మారంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి రూ.3 లక్షలు ఎంపీ మంజూరు చేశారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లోలపు రజని, నాయకులు యోగేష్, చుక్క రాజుగౌడ్, సంతోష్, కిషోర్, గోపికృష్ణ, నియోజకవర్గ కన్వీనర్ శ్రీధర్, మండల అధ్యక్షులు ద్యాగ సరీన్, పిల్లి శ్రీకాంత్, రాధా, ఆనంద్, రాజేందర్ గౌడ్, ఇంద్రకరణ్, భూషణ్ , శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణ, భాను బూత్ అధ్యక్షులు శివకుమార్ శ్రీనివాస్, కందగట్ల రాంచందర్, కూరెళ్ల శ్రీధర్, లక్ష్మణ్‌గౌడ్, గెంటె శ్రీనివాస్,సురేష్, ప్రేమ్,సాయి, పట్టణ అధ్యక్షుడు గోపికిషన్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను త్వరగా పూర్తిచేయాలి

- త్వరలో గ్రంథాలయాల్లో బయోమెట్రిక్ యంత్రాల ఏర్పాటు
- గ్రంథాలయ చైర్మన్ రాజిరెడ్డి


రెంజల్‌లో మాట్లాడుతున్న రాజిరెడ్డి

రెంజల్(బోధన్): రెంజల్‌లో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న నూతన శాఖ గ్రంథాలయ భవన నిర్మాణ పనులను మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న మిగులు పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జిల్లాలో అనేక మండలాల్లో నూతన భవనాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు అందించారు. జిల్లాలోని శాఖ గ్రంథాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. త్వరలో గ్రంథాలయాల్లో బయోమెట్రిక్ యంత్రాలను కలెక్టర్ పర్యవేక్షణలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అంతకు ముందు అద్దె భవనంలో నిర్మిస్తున్న శాఖ గ్రంథాలయాన్ని సందర్శించి పాఠకులతో మాట్లాడారు. అవసరమైన స్టడీ మెటీరియల్స్‌ను అందిస్తామన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాయకులు సాయిబాబ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, పోచయ్య, అనిల్, సాయాగౌడ్, సురేష్‌పటేల్, శివ తదితరులున్నారు.

పుస్తకాలు అందజేత

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని గ్రంథాలయానికి సామాజిక సేవకుడు పట్వారీ తులసి కుమార్ మహనీయుల చరిత్ర పుస్తకాలను అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద, అబ్దుల్‌కలాం, అంబేడ్కర్, వీరేశలింగం తదితర మహనీయుల పుస్తకాలను అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సాహం



నందిపేట్ (ఆర్మూర్) : ఆయిల్‌పాం సాగు కో సం ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని మండల వ్యవసాయ అధికారి రాంబాబు తెలిపారు. మంగళవారం వన్నెల్ కె గ్రామంలో బద్దం లింగారెడ్డి తోటలో ఆయిల్‌పాం గెలల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు మాట్లాడారు. ఆయిల్‌పాం పంటను ఒకసారి నాటితే నిరంతర ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఉద్యానవన శాఖ అధికారి రాజు, వ్యవసాయ అధికారి రాంబాబు, ఏఈవో గంగాధర్, అబ్దుల్ కంపెనీ ప్రతినిధి నిఖిల్ పాల్గొన్నారు.

వరిపంట క్షేత్ర సందర్శన

వేల్పూర్ : మండలంలోని అక్లూర్‌లో యెద్దుల సురేందర్‌రెడ్డి అనే రైతు సాగుచేసిన ఆర్.డి.ఆర్.1200 రకం వరిపంట క్షేత్రాన్ని మండల వ్య వసాయాధికారి శృతి, అధికారులు సందర్శించారు. ప్రతి గ్రామానికి నా ణ్యమైన విత్తనం పథకం కింద ఈ రకం వరి పంటను సాగు చేయించారు.

క్లుప్తంగా

సమస్యలను పరిష్కరించాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్ ఆధ్వర్యంలో హైకోర్టు కోర్టు జడ్జి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి మాధవిలతను మంగళవారం న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్మూర్ న్యాయస్థానంలోని సమస్యలను పరిష్కరించాలని బార్ అసోసియేషన్ సభ్యులు మాధవిలతకు వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిష్కారానికి కృషిచేస్తానని మాధవిలత తెలిపారని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. న్యాయవాద బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



రెంజల్(బోధన్): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్ అందించారు. గౌరాజీ రాజుకు రూ. 40 వేలు, అనూజకు రూ. 24వేలు మంజూరు కావడంతో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో స్థానిక నాయకులతో కలిసి చెక్కులను అందించారు.బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మె శ్రీనివాస్‌యాదవ్, నాయకులు దనుంజయ్, సాయిబాబగౌడ్, జావీదోద్దీన్, పోచయ్య, సురేష్‌పటేల్, ఆసాని అనిల్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు సన్మానం



పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిజ్ఞాన్ మాల్వియను ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఏలేటి రవికాంత్ రెడ్డి, అజ్జు మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్‌కు స్వాగతం పలుకుతూ నాయకులు ఘనంగా సన్మానించారు. అలాగే పదోన్నతిపై హన్మకొండకు బదిలీ అయిన ఆర్డీవో రాజా గౌడ్‌ను నాయకులు సన్మానించారు. ఆలూర్ మండల తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియను అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ఐ అరవింద్, ఏఆర్ఐ రేణుక, సిబ్బంది గీత, నరేష్, భరత్, సందీప్, వసుందర తదితరులు పాల్గొన్నారు.

నీటిశుద్ధి యంత్రం ఏర్పాటు



మాక్లూర్: మండలంలోని గొట్టిముక్కల ప్రభుత్వ పాఠశాలలో ఐడీబీఐ బ్యాంకు నిజామాబాద్ రీజియన్ మేనేజర్ దేవునిపల్లి వెంకటేశ్ ఆధ్వర్యంలో అధికారులు నీటి శుద్ధి యంత్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడీబీఐ బ్యాంకు సమాజ సేవలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు మేనేజర్ శంకర్, శ్రీధర్, హెచ్ఎం రఘు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందకృష్ణను కలిసిన షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు



బోధన్‌టౌన్(బోధన్) : నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్, కార్మికులు కోరారు. మంద కృష్ణను ఆర్మూర్‌లో వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడారు. మందకృష్ణ మాదిగ చ క్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ ఉద్యమానికి మద్దతు ఇస్తానని భరోసా ఇచ్చారని కార్మికులు వెల్లడించారు. కార్మికులు రవిశంకర్ గౌడ్, శ్రీనివాస్, గోసంగి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాజేష్‌లు ఉన్నారు.

మండల శాఖ అధికారులతో ప్రత్యేకాధికారి సమీక్ష


కమ్మర్‌పల్లిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి తిరుమల ప్రసాద్

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల ప్రత్యేకాధికారిగా ఆత్మ పీడీ ఆర్.తిరుమల ప్రసాద్ నియమితులయ్యారు. ఇదివరకు ఇక్కడ ప్రత్యేకాధికారిగా పని చేసిన డీఆర్‌డీవో సాయాగౌడ్‌ను డిచ్‌పల్లి మండలానికి వెళ్లారు. మంగళవారం తిరుమల ప్రసాద్ మండల పరిషత్ కార్యాలయానికి రాగా ఎంపీడీవో, ఎంపీవో, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శానిటేషన్, ప్లాంటేషన్, సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, డయేరియా, దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. పనులు ఎంత వరకు వచ్చాయో వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..


వర్నిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏడీ

వర్ని: మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన భూమికి సమాంతరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు మంగళవారం పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా స్టాండు పెట్టి ఎత్తు పెంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తామని విద్యుత్ శాఖ ఏడీ నగేష్ కుమార్ తెలిపారు. 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, సబ్ ఇంజనీర్ బాలకృష్ణ, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ

రెంజల్(బోధన్): విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ సూచించారు. మంగళవారం రెంజల్‌లోని ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మితిమీరిన వేగం ప్రాణాలు తీస్తుందన్నారు. వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లు వాహనం నడిపితే తండ్రుల పై కేసులు నమోదు చేయాల్సి వస్తుందన్నారు. ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్, ఎస్సై చంద్రమోహన్, ప్రిన్సిపాల్ ఫిరోజ్ హైదర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో డీజేలు వాడొద్దు

రుద్రూర్: వినాయక మండపాల వద్ద, శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని ఎస్సై సాయన్న తెలిపారు. రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం డీజే నిర్వాహకులు, యజమానులకు పోలీస్ నిబంధనలను ఎస్సై వివరించారు.

బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలను అందించాలి


బోధన్ జిల్లా ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

రెంజల్/బోధన్/బోధన్ టౌన్/వర్ని : ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలను అందించాలని అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలింతలతో మాట్లాడుతు ముర్రుపాల పై అవగాహన కల్పించారు.అలాగే వర్ని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో మోస్రా అంగన్‌వాడీ సెక్టార్ సూపర్ వైజర్ సుమలత సమావేశం నిర్వహించారు. బోధన్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని ప్రసూతి వార్డులో తల్లులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తల్లిపాలపై అవగాహన కల్పించారు. సాలూర మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాలవారోత్సవ అవగాహన సమావేశంలో ఐసీడీఎస్ సాలూర సెక్టార్ సూపర్‌వైజర్ గంగావేణి మాట్లాడారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల ప్రభావం నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గైనకాలజిస్టు సుష్మా, సూపర్ వైజర్స్ ఆసియా, కొమురవ్వ, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న నీలం చిన్నరాజులు


కోటగిరిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

వర్ని(చందూర్) : స్థానిక సంస్థల ఎన్నికల్లో చందూరు మండలంలో మెజారిటీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలుపించుకోవాలని కామారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు నీలం చిన్నరాజులు అన్నారు. మంగళవారం చందూర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధికి 100 శాతం నిధులు కేంద్రం నుంచి వస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పోశెట్టి, మండల అధ్యక్షులు విఠల్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరేడ్ల నర్సింలు, ఉపసర్పంచ్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్, బంటు సురేష్, నరహరిరావు, మహేష్ పాల్గొన్నారు.

కోటగిరిలో బీజేపీ బూత్ సంపర్క్ అభియాన్

రుద్రూర్ : కోటగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో బూత్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని వివిధ వార్డుల్లో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి తాడ్కోల్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు పుల్లె మోహన్ రావ్, హవగిరి రావ్ దేశాయ్, మహిళా నాయకురాలు శ్యామల, పార్టీ మండల అధ్యక్షులు వేముల నవీన్, నాయకులు దుబాస్ మహేష్, మామిడి శ్రీనివాస్, సాయిలు, వడ్ల శ్యామ్, తదితరులున్నారు.

కరెంట్ కోతలపై రైతుల ఆగ్రహం



బాల్కొండ: అప్రకటిత కరెంట్ కోతలపై బాల్కొండ మండల కేంద్ర రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో ఆందోళన చేశారు. వర్షాలు కురువక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, పంటలకు నీరందించుటకు ఇబ్బందులు పడుతుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. 24 గంటలు విద్యుత్ సరఫరా చేపట్టాలని రైతులు ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ మహేశ్‌ను నిలదీశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్‌లో నూత్‌పల్లి వాసికి రజత పతకం



డొంకేశ్వర్(ఆర్మూర్) : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో డొంకేశ్వర్ మండలం నూత్ పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి మంగ్లారం శివరాజ్ కుమార్ రజత పతకం సాధించాడు. హనుమకొండలో జరిగిన జావిలింగ్ త్రో పోటీలో శివరాజ్ కుమార్ పాల్గొన్నాడు. శివరాజ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

నవీపేట : పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ లో నిందితులకు నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. జన్నెపల్లి గ్రామానికి చెందిన అజారి ప్రశాంత్, మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహేష్ గోవింద్ రావులను రిమాండ్‌కు తరలించగా నిజామాబాద్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం ఒక్కొక్కరికి 4 రోజులు చొప్పున జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న సింగాడే పాండు

బోధన్ : స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సింగాడే పాండు నాయకులకు సూచించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన పార్టీ అసెంబ్లీ నియోజక వర్గ స్థాయి కమిటీ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి అసెంబ్లీ నియోజక వర్గ స్థాయి వరకు పార్టీ పటిష్టతపై దృష్టి సారించాలన్నారు.పార్టీ సిద్ధాంతాలను గడప గడపకు తీసుకెళ్లాలన్నారు. సమావేశానికి హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి గైని గంగాధర్ నాయకులు పార్టీ నిర్మాణ అంశాలు, భవిష్యత్తు కార్యాచరణ పై దిశా నిర్దేశం చేశారు. ప్రతినిధులు నీరడి శంకర్, నీరడి రవి, బాగారే గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

హిందువులు ఐకమత్యంతో పండుగలు జరుపుకోవాలి



ఆర్మూర్ : హిందువులంతా ఐకమత్యంతో పండుగలు జరుపుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని జెండాబాలాజీ మందిరంలో మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజాం కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న జెండా పండగ విశిష్టతను ఈ సందర్భంగా వివరించారు. తొమ్మిది రోజుల క్రితం ప్రతిష్ఠించిన జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయంలోని వేంకటేశ్వర స్వామి వద్ద పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతరను వీక్షించారు.సర్వసమాజ్ అధ్యక్షుడు కొట్టాల మోహన్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు మందుల బాలు, బీజేపీ నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా అయ్యప్ప మాసపూజోత్సవం

బాల్కొండ : బాల్కొండ అయ్యప్ప ఆలయంలో మంగళవారం అయ్యప్ప మాసపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వినాయక, సుబ్రహ్మణేశ్వర స్వామీ పూజ, అనంతరం అయ్యప్ప మెట్లపూజ నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తమలపాకుల పూజ



బోధన్‌రూరల్ : పట్టణంలోని మారుతి మందిర్‌లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష తమలపాకుల పూజ ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం మంగళవారం పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహరాజ్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, లక్ష తమలపాకుల మహా అర్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు, భక్తులను జిల్లా ఆర్యవైశ్య సమాజ్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ గుప్తా ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గుండేటి శంకర్, ఈవో రాములు, అర్చకులు ప్రవీణ్ మహరాజ్, మధు, భక్తులు పాల్గొన్నారు.

కందెరాయుడు మల్లన్న ఆలయంలో ..

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్‌లోని కందెరాయుడు మల్లన్న స్వామి ఆలయంలో ఇందూరు గో సేవా సమితి సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు, జోడు లింగాలకు అభిషేకం, గోమాత పూజను వైభవంగా నిర్వహించారు. గో సేవా సమితి అధ్యక్షుడు వీర మల్లి రమేష్, కోట యాదగిరి, రజినీకాంత్, పీ శ్రీనివాస్, తిరుపతి, పోశెట్టి, డాక్టర్ అరుణ్, వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం రెడ్డి, నడిశరం మల్లయ్య, గణపతి, కన్నా, శ్రీనివాస్, నరేష్, మహేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

క్రీడా దుస్తులు, సౌండ్ సిస్టం వితరణ



వేల్పూర్: వేల్పూర్ ఉన్నత పాఠశాలకు పీపుల్స్ వారియర్స్ అండ్ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యుడు ప్రేమానందం తన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం రూ. 70 వేల విలువైన క్రీడాదుస్తులు, సౌండ్ సిస్టం వితరణ చేశారు. హెచ్ఎం రాజన్న, వేల్పూర్ మాజీ సర్పంచ్ తీగెల మోహన్, ఏఏపీ చైర్మన్ హరిత, ఆర్మూర్ నిఖిల్, అంక్సాపూర్ నిఖిల్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌కు క్రీడా పరికరాలు..

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌కు శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలను వితరణ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు విష్ణు జగతిపటేల్, ఉపాధ్యక్షుడు కీసీ గంగాధర్ పటేల్, అమరగోనీ రవీందర్ పటేల్, పాఠశాలకు క్రికెట్, వాలీబాల్, షటిల్ కిట్లను అందజేశారు.

బషీరాబాద్ జెడ్పీహెచ్ఎస్‌కు కంప్యూటర్లు, ప్రింటర్..

కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి మూడు కంప్యూటర్ సిస్టంలు, ఒక ప్రింటర్ వితరణ చేశారు. పీడీలు జైడీ రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌ల అభ్యర్థన మేరకు పాఠశాలకు రూ. 1.50 లక్షల విలువ చేసే కంప్యూటర్ సిస్టంలు, ప్రింటర్లను అందజేశారు.

జాకోరా గ్రామానికి ఫ్రీజర్..

వర్ని: మండలంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రీజర్‌ను వితరణ చేశారు. అనంతరం బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడిన 14 మందికి జరిమానా

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తోండ శివారులో పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారికి బోధన్ కోర్టు న్యాయమూర్తి శేషతల్ప సాయి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారని ఎస్సై సునీల్ తెలిపారు. వివరాలు ఇలా.. గత నెల 17న ఎత్తోండ శివారులో పేకాట ఆడుతున్న 14 మందిని పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చారు. మంగళవారం జడ్జి విచారణ అనంతరం ఒక్కొక్కరికి రూ. 2వేల చొప్పున జరిమానా విధించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్)శివారులో ఉన్న ఆదర్శ పాఠశాల /కళాశాల లో ఇంటర్ ఫస్టియర్‌లో ఖాళీగా ఎంపీసీ, సీఈసీ సీట్లను భర్తీ చేయడానికి అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చెన్నప్ప తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు గురువారంలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

అద్దె చెల్లించకుంటే దుకాణాల సీజ్



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్‌కు సంబంధించిన కాంప్లెక్స్ దుకాణాదారులు సకాలంలో అద్దె చెల్లించకుంటే దుకాణాలను సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పంత్‌రోడ్డు, జంబిహనుమాన్ వద్ద మున్సిపల్‌కు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా అద్దె బకాయిలు ఉన్న లీజుదారులకు నోటీసులు అందజేశారు. సిద్దుల గుట్ట వెనుక గల గుండ్ల చెరువు అభివృద్ధి పనులను పబ్లిక్ హెల్త్ డిప్యూటీ ఇంజనీర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ శేఖర్, శానిటరి ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
9010585333
9849180084
9966958859
7893150102
9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899